# రవ్వ

ఇంకో అయిదు నిమిషాల్లో కాలేజి అయిపోతుందనగా క్లాసు వదిలిపెట్టి స్టాఫ్ గదిలోకి వచ్చి అలా కూర్చున్నానో, లేదో బంట్రోతు వచ్చి, "సార్, మీకు ఫోనొచ్చింది" అన్నాడు.

కుర్చీలోంచి లేచి, పక్కనే ఉన్న ఆఫీసు గదిలోకి వచ్చి మేనేజరు బల్ల మీదున్న రిసీవరు అందుకున్నాను. ఫోనులో అటువయిపు నుండి వెంటనే ఎటువంటి శబ్దం వినిపించలేదు. సామాన్యంగా నాకు ఎవరి దగ్గర నుండి కాలేజికి ఫోన్లురావు. ఎక్కువ సమయం క్లాసుల్లో ఉండటం జరుగుతుంటుంది. క్లాసు లేక పోయినా ఆఫీసు మేనేజరుకు బుద్ధి పుడితే కబురు పంపిస్తాడు. లేకుంటే లేదు. "హలో... రామారావును మాట్లాడుతున్నాను" అన్నాను.

"నాన్నారూ, నేను... బాబ్జీని మాట్లాడుతున్నాను." బాబ్జీ గొంతు కంగారుగా ఉంది. నాలో ఆందోళన మొదలయింది.

"ఎక్కడి నుండిరా?" అడిగాను.

"రమణారావు గారి ఇంటినుండి మాట్లాడుతున్నాను....... మీరు వెంటనే ఇంటికి వచ్చేయండి".

"ఎందుకు?"

"అమ్మ మిమ్మల్ని ఉన్నపళంగా రమ్మని చెప్పింది."

నా గుండె వేగంగా కొట్టుకోవడం మొదలెట్టింది. " ఏమయింది, ఎవరికయినా ప్రమాదమేమైనా జరిగిందా?" అడిగాను ఆత్రుతగా.

"ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.......... ఇంట్లో గొడవగా ఉంది."

"ఏం గొడవ, దేనికి?"

"మీరు పాప కాలేజి ఫీజుకై పంపించిన ఎనభయి రూపాయలు పోయాయి." నెమ్మదిగా చెప్పాడు.

"ఎలా పోయాయి? ఎక్కడ పోయాయి......?" వివరాలు అడుగుతున్నాను, అవతలివైపు నుండి ఫోను పెట్టేసిన చప్పుడు వినిపించింది. వివరాలు చెప్పనందుకు బాబ్జీ మీద కోపం వేసింది. ఫోనులో ఎక్కువ సేపు మాట్లాడితే మేనేజరు విసుక్కుంటాడు.

ఫోన్ క్రెడిల్ చేసి, "థ్యాంక్స్" చెప్పి ఆఫీసు గదిలోంచి బయటికి వచ్చాను. స్టాఫ్ గదిలోంచి బయటకొచ్చి స్టాండులో ఉన్న సైకిలు తీసుకుని ఎక్కి రోడ్డుమీదకు వచ్చాను.

పాప కాలేజీ ఫీజు ఫైన్ లేకుండా కట్టడానికి ఈవేళ చివరి రోజు అవటాన నాతో పనిచేస్తున్న వెంకట్రావు దగ్గర వంద రూపాయలు చేబదులు తీసుకుని ఈ మధ్యాహ్నమే మా ఆఫీసు బంట్రోతు కిచ్చి ఇంటికి పంపించాను. మా ఇంటికి పాపవాళ్ల కాలేజి దగ్గరగా ఉంది. నా భార్య హేమలత పాప వాళ్ల కాలేజికి వెళ్లి ఫీజు కట్టేసి ఉంటుందనుకున్నాను. ఎనభయి రూపాయలు పోయాయంటే ఫీజు కట్టలేదన్నమాట. ఫైన్‌తో రేపు కట్టించుకుంటారో లేదో? నెల చివర్లో అప్పుకోసం మరలా ఎవరిని దేబిరించటం? ఇరవై నిమిషాల తరువాత మా ఇంటికి చేరుకుని సైకిలు స్టాండు వేసి లోపలికి నడిచాను. మధ్య గదిలో హేమలత, పాప, బాబ్జీ కాకుండా మా ఇంటి చుట్టు పక్కలవాళ్లు ఆరేడుగురున్నారు. గదిలో పుస్తకాలు, తదితర వస్తువులు చిందర వందరగా పడిఉన్నాయి. హేమలత అద్దాల బీరువాలోంచి ఒక్కొక్క పుస్తకాన్ని తీసి కింద పడేస్తోంది. రేడియో ఉన్న బల్ల పక్కగా రమణారావు గారు, ఆయన భార్య ప్రసూనాంబ గారు నిలబడి ఉన్నారు. వాళ్లిద్దరి ముఖాలు జేవురించి ఉన్నాయి. ప్రసూనాంబగారి కళ్లు ఎర్రగా ఉన్నాయి. రమణారావు గారికి నా వయసు ఉంటుంది. ఇన్‌కంటాక్సు ఆఫీసులో పనిచేస్తున్నారు. వాళ్లిల్లు మా పక్క వీధిలో ఉంది. నేను గదిలోకి అడుగుపెట్టగానే అక్కడున్న అందరి దృష్టి నామీద పడింది. హేమలత పుస్తకాలు తీయటం ఆపి అప్పటివరకు నిగ్గపట్టుకున్న దుఃఖాన్ని ఆపుకోలేక భోరుమని ఏడ్చింది.

"ఏలా పోయింది డబ్బు?" చిన్నగా అడిగాను. ఎనభయి నాకు తక్కువేమి కాదు. నా నెలజీతంలో సగం.

హేమలత ఏడవటం ఆపి కళ్లనీళ్లు తుడుచుకుంటూ ఏదో చెప్పబోయి ఆగింది. బాబ్జీ వంక చూశాను. వాడేదో చెప్పబోతుండగా రమణారావుగారు ముందుకువచ్చి, "నా భార్య మీ ఇంట్లో ఎనభయి రూపాయలు దొంగిలించిందని మీ శ్రీమతి గారు అనుమాన పడుతున్నారు." నెమ్మదిగా అన్నాడు.

ప్రసూనాంబగారి వంక చూశాను. "నేను దొంగిలించలేదండీ నన్ను మీ ఆవిడ అనవసరంగా అనుమానిస్తున్నారు. నేనటువంటి మనిషిని కాను. నన్ను నమ్మండి........" అంటుంటే ఆమె కంఠం జీరవోయింది.

రమణారావు దంపతులతో గత మూడు సంవత్సరాలుగా సన్నిహిత సంబంధం ఉంది. ఇద్దరూ సహృదయులు. ఆయన జీవితంలో కష్టపడి పైకి వచ్చిన మనిషి. ప్రసూనాంబగారు బాగా డబ్బున్న కుటుంబంలోంచి వచ్చినావిడ. ఆమె ఎనభయి

రూపాయలకు ఆశపడుతుందని నేను నమ్మను. అంత మర్యాదస్తురాలు దొంగతనం చేయదుగాక చేయదు. హేమలతకు ఆమె అంటే ఏంతో ఇష్టం. ఇద్దరు చాలా కలుపుగోలుగా ఉంటారు. నా భార్య రవంత సెన్సిటివ్ మనిషి. అందరితో సజావుగా మెలుగుతూ ఉంటుంది. తనది కాని విషయంలో ఎప్పుడూ జోక్యం చేసుకోదు. ఎక్కడో పొరపాటు జరిగింది. అంతమంది ముందు ప్రసూనాంబ గారిని నిలబెట్టి దొంగతనం మోపటం నాకు బాధ కలిగించింది. హేమలత అంతలా తొందర పడుతుందని నేను ఊహించలేదు. నేను వచ్చే వరకైనా ఆగి ఉండాల్సింది. కోపం వచ్చినా అందరి ముందు వ్యక్తం చేయటం బాగుండలేదనిపించింది. హేమలత ప్రసూనాంబ గారి ముందుకు వచ్చి, చేతులు జోడించి, నమస్కారం చేస్తూ, "ప్రసూనాంబగారూ ! మీరు దయచేసి అబద్ధాలు ఆడకండి. మేము మీఅంత ధనవంతులం కాదండీ. నేను ప్రమాణం చేసి చెబుతున్నాను. ఆ డబ్బు మీరే తీశారు. మీరు తప్ప వేరేవాళ్లు తీసే అవకాశం లేదు. ఈ మధ్యాహ్నం నుండి మీరు తప్ప వేరెవ్వరూ రాలేదు...... మీకు ఇవ్వాలని ఉంటే ఇవ్వండి...... ఇస్తే సంతోషిస్తాను...... లేకుంటే పోనివ్వండి......" అంది.

హేమలతకు కోపం వచ్చినప్పుడు విచిత్రంగా ప్రవర్తిస్తుంటుంది ఏమి చెప్పబోయినా వినదు. చేతిలో ఏ వస్తువున్నా విసిరికొడుతుంటుంది. ఇటువంటి ప్రవర్తనకు నేను మా పిల్లలు అలవాటు పడిపోయాము. ఇంట్లో చెల్లుతుంది గాని బయటి వాళ్లతో ఎలా వీలవుతుంది?

"నువ్వు ఎక్కడోపెట్టి మర్చి ఉంటావు." హేమలతతో సౌమ్యంగా అని రమణారావు గారి దగ్గరకు వచ్చి ఆయన చేతులు పట్టుకుని "మీరు నన్ను క్షమించండి. జరుగకూడని పని జరిగినందుకు సిగ్గుపడుతున్నాను. దయచేసి మనసులో ఏమీ ఉంచుకోకండి....." అన్నాను.

ప్రసూనాంబగారు నా భార్య వైపు కొరకొర చూస్తూ కుడిచేతి చూపుడువేలు ఆడిస్తూ, "చూడండి...... నేనూ అభిమానం కలిగిన మనిషినే, నన్ను అనుమానించి అవమానించినందుకు నేను కాబట్టి దిగమింగి ఊరుకుంటున్నాను........ వేరే ఎవరయినా అయి ఉంటే నా .........." పళ్లు పటపటా కొరుకుతూ బయటకు వెళ్లిపోయారు. ఆమె వెనక రామణారావు గారు వెళ్లిపోయారు.

నిమిషంపాటు మౌనంగా ఉండి, తలెత్తి గదిలో నిలబడి చోద్యం చూస్తున్న వాళ్లవంక చూశాను. నా చూపుల్లోని తీవ్రత గమనించి ఒక్కొక్కరే వెళ్లిపోసాగారు. నాలుగయిదు నిమిషాల్లో బయటివాళ్లందరూ వెళ్లిపోయారు.

వీధి గుమ్మం తలుపు మూసి గడియపెట్టి కుర్చీలో కూర్చుని, హేమలత వంక చూస్తూ "ఎందుకు తొందర పడ్డావు?" నెమ్మదిగా అడిగాను.

"నేనేం తొందర పడలేదు........ తొందర పడలేదు........ ఆమె దొంగతనం చేసింది....... నేను పొరబడటం లేదు....... దొంగను దొంగ అనటం తప్పా?" హేమలతకు ఇంకా కోపం తగ్గలేదు. కాకపోతే దిశ మారి నావైపుకు తిరిగింది.

"సరే. అన్నావు. అన్నందుకు పోయిన డబ్బు తిరిగొచ్చిందా? చెప్పు. మన జాగ్రత్తలో మనం ఉండిఉంటే దొంగతనం జరిగి ఉండేది కాదు. ఇంత రాద్ధాంతం అయి ఉండేదికాదు......." అంటుంటే నామాటలు ఆమె కోపాన్ని ఎక్కువ చేశాయకుంటాను. బీరువాలోంచి రెండు పుస్తకాలు అందుకుని విసురుగా గది మూలకు గిరాటు వేసి పడక గదిలోకి వెళ్లి, చప్పుడయ్యేలా తలుపు వేసుకుంది. ఇహ వారం రోజులపాటు నాతో మాట్లాడదు.

దీర్ఘంగా నిట్టూర్చి, "నువ్వు వచ్చి ఎంతసేపయిందిరా?" బాబ్జీని అడిగాను.

"మీకు ఫోన్ చేయటానికి పావుగంట ముందు" అన్నాడు బాబ్జీ.

"నువ్వో?"

"గంట అవుతుంది." అంది పాప.

"నువ్వు వచ్చేసరికి గొడవ మొదలయిందా?"

"ఊ. మీరు డబ్బు పంపించాక అమ్మ ప్రసూనాంబ గారు కలిసి మా కాలేజీకి వచ్చి ఫీజు కడదామనుకున్నారట. సిద్ధపడి తీరా బయల్దేరే సమయానికి చూసుకుంటే డబ్బు మాయమయ్యింది.

"ఇప్పుడే చేద్దాం?" అడిగాను.

ఏం చేయాలో తోచలేదనుకుంటాను, తలలు అడ్డంగా ఆడించారు ఇద్దరూ.

"ఒకపని చేద్దాం" అన్నాను.

"చెప్పండి."

"మనిల్లు వెతుకుదాం. డబ్బు దొరికిందనుకోండి, రమణారావు గారింటికి వెళ్లి దొరికిన సంగతి చెప్పి మరోసారి క్షమాపణలు చెప్పుకుంటాను. ఒక వేళ దొరకలేదనుకోండి అప్పుడు కూడా వాళ్లింటికి వెళ్లి డబ్బు మా ఇంట్లోనే దొరికిందని అబద్ధం చెప్పి క్షమించమని అడగటం భావ్యంగా ఉంటుందని అనుకుంటున్నాను. మీరేమంటారు?" వాళ్లిద్దరి ముఖాల్లో చూశాను.

నా ఆలోచన మా పిల్లలిద్దరికీ నచ్చినట్టుంది. వెంటనే "సరే" అన్నారు. టీ తాగాక ముగ్గురం కలిసి గంటన్నరపాటు ఇంటినంతటినీ వెతికాం, ఒక్క పడక గది తప్ప. ఫలితం కనిపించలేదు. అనుకున్న విధంగా ఆ తర్వాత రమణారావు గారింటికి వెళ్దామనుకునేంతలో మా ఇంటి వీధి తలుపు తట్టిన చప్పుడయింది. వీధి తలుపు గడియ

తీసి తలుపులు తెరిచాను. ఎదురుగా రమణారావు గారు నిలబడి ఉన్నారు. దారికి అడ్డం తొలగి "రండిసార్. నేనే మీ ఇంటికి వద్దామనుకుంటున్నాను........" అంటున్నాను ఆయన లోపలి వస్త్రా జేబులోంచి కొత్త పదిరూపాయల నోట్లు బయటికి తీశాడు. "నా భార్య తరుపున క్షమాపణలు చెప్పుకుంటున్నాను........" అని చిన్నగా వణుకుతున్న చేతులతో ఆ నోట్లు నా కుడి చేతిలో పెడుతూ, "నా భార్యకున్న బలహీనత ఎలా మాన్పించాలో అర్థంకావటంలేదండీ." చల్లటి చేతులతో నాచేతులు నొక్కి నేను ఆశ్చర్యంలోంచి తేరుకునే లోగా నా చేతులు వదిలి వెళ్లిపోతున్నాడు.

నేను అనుకున్నది ఒకటి. జరిగింది వేరొకటి. బొత్తిగా ఊహించనిది. "రమణారావు గారూ.......మాట" అన్నాను. ఆయన ఆగలేదు త్వరగా వెళ్లిపోతున్న ఆయన్ని చూస్తోంటే బాబ్జీ నా పక్కకు వచ్చి, "ఏమయింది?" అడిగాడు.

నా చేతుల్లోని నోట్లను బాబ్జీ చేతిలో పెట్టి, "రమణారావు గారు ఈ డబ్బు తెచ్చి ఇచ్చారు.......ప్రసూనాంబగారు ఈ డబ్బును........" అంటుండగా పడక గది తలుపు తెరుచుకున్న శబ్దమయింది. చెప్పటం ఆపి వెనక్కి తిరిగాను. మా వైపు మెల్లగా వస్తున్న హేమలత చేతుల్లో పది రూపాయల నోట్లు ఉన్నాయి.

◆ సైనిక సమాచార్, సచిత్రవార పత్రిక, 25 జూన్ 1978